రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి


నిజాంపేట్‌లో పర్యటిస్తున్న ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: వర్షాలు రెండురోజులపాటు కురువనున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమతంగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాలను ఆదివారం ధన్‌రాజ్‌యాదవ్ సందర్శించారు. లోతట్టు ప్రాంత ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ధన్‌రాజ్‌యాదవ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్ సింగ్, ఇంజనీర్ అరుణ్, సూపర్‌వైజర్ సురేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సవ నిర్వాహకులు బాధ్యతాయుతంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌సాగర్

కుత్బుల్లాపూర్: గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వహణ కమిటీ సభ్యుల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉత్సవ సమితి కొంపల్లి శాఖ కన్వీనర్ పెద్దబుద్దుల సతీష్ సాగర్ అన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కొంపల్లి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏ.యం.ఆర్ గార్డెన్‌లో గణేష్ మండపం నిర్వాహకుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం నుంచి తీసుకోవాల్సిన ధృవపత్రాలు, అనుమతుల తదితర విషయాలపై సూచనలు చేశారు. రాజకీయాలకు అతీతంగా హిందువులంతా సంఘటితమై ఉత్సవాలను జరుపుకోవాలని, మండపం నిర్వాహకులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అన్నివేళలా అందుబాటులో ఉంటుందన్నారు. అదే విధంగా కొంపల్లి పట్టణ బీజేపీ కో.కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు రాజిరెడ్డి, శివాజీరాజులు ఉత్సవ కమిటీ సభ్యులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మధు, అశోక్, నరసింహ, గోపాల్ రెడ్డి, ఆనంద్ సగర, లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా జన్మదిన వేడుకలు

సుభాష్‌నగర్: సూరారం నివాసి పర్యావరణ పరిరక్షకుడు రవీందర్ ముదిరాజ్ తన పుట్టినరోజు వేడుకలను ఆదివారం తన నివాసంలో వినూత్నంగా జరుపుకున్నారు. సందర్భంగా ప్లాస్టిక్ రహిత విప్లవానికి నాంది పలుకుతూ టపాకాయలు, కేకులు, శాలువలు లేకుండా ఆకులు, పండ్లతో వేడుక జరుపుకున్నారు. స్థానికంగా ఉండే యువకులు రవీందర్ ముదిరాజ్‌కు పండ్లు, కూరగాయలతో రూపొందించిన దండలను వేసి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని పర్యావరణానికి ముప్పు కలగకుండా ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని ఈ సందర్భంగా రవీందర్‌ముదిరాజ్ కోరారు.


రవీందర్‌ముదిరాజ్‌ను కూరగాయిలు, పండ్ల దండతో సత్కరిస్తున్న యువకులు

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి



కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రబాబు

కుత్బుల్లాపూర్: సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ×పెన్షన్ విద్రోహ దినమ్ల పేరుతో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నుంచి తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు తరలివెళ్లి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా లయన్ క్లబ్ 17వ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం


చెక్కు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ లయన్స్ క్లబ్ 17వ పదవీ స్వీకార ప్రమాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం ప్రగతినగర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి ఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా ప్రగతి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ప్రమాణం చేయించగా, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఆర్. ఎస్.రాజు నూతన సభ్యులకు పరిచయ ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా లయన్స్ కె.వీ.శేషయ్య, డి.ఎల్లా సుబ్బారెడ్డి, తోట రామకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న బాలుడి కుటుంబానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ 16వ సంవత్సరాలుగా క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని, భవిష్యత్తులోనూ అవసరమైన చోట్ల సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. లయన్ డాక్టర్ భాస్కరరావు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ సత్యవోలు రాంబాబు, సీహెచ్ సత్యనారాయణ, డాక్టర్ మహేశ్ పగడాల, సాంబశివరావు, దొంతి శిల్పారెడ్డి, రాఘవేంద్ర ప్రసాద్, పీవీ సత్యనారాయణ, జీవీఆర్ గౌడ్, శ్రీచంద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కత్వా చెరువు తూములను పరిశీలించిన అధికారులు


కత్వా చెరువు తూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ సహారా

దుండిగల్: దుండిగల్-గండిమైసమ్మ మండల పరిధిలోని కబ్జాకు గురైన కత్వా చెరువు తూములను ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సందర్శించి నీరు సాఫీగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. స్థానిక ముదిరాజ్ సంఘం కత్వా చెరువు తూముల కబ్జా విషయమై ఇటీవల హైడ్రా కమిషనర్, జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఇరిగేషన్ డీఈ ఆదేశాలతో ఆదివారం ఉదయం 7 గంటలకు ఇరిగేషన్ ఏఈ సహారా, రెవెన్యూ అధికారులు జేసీబీతో మల్లంపేట్‌లోని కత్వా చెరువు వద్దకు చేరుకుని పూడ్చివేసిన కత్వా చెరువు రెండు తూములలో జేసీబీతో మట్టిని తవ్వించి అలుగు పారుతున్న చెరువు నీరు బయటకు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. కత్వా చెరువు తూమును కొందరు కబ్జాదారులు పూడ్చివేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువు నిండుకుండలా మారిందని, దీంతో కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని అధికారుల దృష్టికి తీసకువెళ్లామని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షుడు తలారి కృష్ణలు పేర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్ అనంతస్వామి, ఇరిగేషన్, రెవెన్యూశాఖల అధికారులకు సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


జేసీబీతో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

స్తంభించిన జనజీవనం!

- ఎడతెరిపిలేని వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

- రోడ్లపై ఏరులైపారిన వరద.. పొంగిన డ్రైనేజీలు
- నేలకొరిగిన భారీ వృక్షాలు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- వరదనీరు నిల్వ ఉండకుండా అధికారుల చర్యలు

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో వీచిన గాలులతో కూడిన వర్షాలకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. ప్రధాన రోడ్లపై వరదనీరు ఏరులై పారగా డ్రైనేజీ లైన్లు పొంగి పొర్లాయి.. మాన్‌సూన్, జలమండలి, జంట సర్కిళ్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో వరదనీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. పలు శివారు మున్సిపాలిటీల్లోని చెరువుల అలుగులు పారగా తూములను తెరిచి వరదనీటిని బయటకు పంపించారు. ప్రధాన రోడ్ల వెంబడి చేరిన వరదనీటిని వాటర్ డ్రెయిన్‌ల మూ తలు తెరిచి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పలు చోట్ల రోడ్లపై నేలకొరిగిన వృక్షాలను జేసీబీలతో పక్కను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


సుచిత్రలో పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది..


ఏపీహెచ్‌బీ కాలనీ పార్కులో వేర్లతో సహా నెలకొరిగిన చెట్టు..


వర్షంలో విధులు నిర్వహిస్తున్న బాచుపల్లి పోలీసులు..


ప్రగతినగర్ ఎన్ఆర్ఐ కాలనీలో మోకాల లోతులో ప్రవహిస్తున్న వరదనీరు..


చెట్లను తొలగిస్తున్న దుండిగల్ మున్సిపల్ అధికారులు..


జీడిమెట్ల బస్ డిపో నర్సాపూర్ రాష్ట్ర రహదారి వద్ద..


దూలపల్లి సమీపంలో గాలివానకు విద్యుత్ తీగలపై కూలిన చెట్టు..


అపర్ణ సెరిమిటీ రోడ్డులో నెలకొరిగిన వృక్షం..


బాలయ్యనగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు..


గణేష్‌నగర్ నాలాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు..


బాచుపల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తాకు వెళ్లే రహదారిలో...

సూర్యా గ్లోబెల్ హైస్కూల్‌లో పోటీలు వాయిదా

కుత్బుల్లాపూర్: ఎస్‌జీఎఫ్ కుత్బుల్లాపూర్ జోనల్ లెవల్ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను వాయిదా వేసినట్లు సంస్థ కుత్బుల్లాపూర్ జోనల్ సెక్రటరీ గోనె అరుణజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. బాచుపల్లిలోని సూర్యా గ్లోబెల్ హైస్కూల్‌లో ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు బాలురు, బాలికల అండర్-14, అండర్ -17 పోటీలు జరగాల్సి ఉండగా వర్షాల నేపథ్యంలో టోర్నమెంట్‌ను నిలిపివేసినట్లు అరుణ జ్యోతి పేర్కొన్నారు. త్వరలోనే పోటీలు జరిగే తేదీలను ప్రకటిస్తామని, ఇతర వివరాలకు 9290496443 నెంబరులో సంప్రదించాలని ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, కామర్స్, ఫిజిక్స్, సబ్జెక్ట్‌లో బోధన చేసేందుకు అర్హులైన అభ్యర్థులు అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని. అదేరోజున ఇంటర్వ్యూలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వడం కుదరదని, అభ్యర్థులు ప్రకటనలో పేర్కొన్న విధంగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, సంబంధిత సబ్జెక్టులో పీజీ 55శాతం ఎస్‌ఇటీ/ఎస్ఇటీ/పీజీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఇంచార్జి ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు కళాశాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందన్నారు.

నేలకూలిన భారీ చెట్టు



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భారీ చెట్లు నేలకూలాయి. చెట్టు దగ్గరలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో స్తంబాలు కూడా విరిగిపోయాయి. వర్షం కారణంగా ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవటంతో ఎలాంటి ప్రాణహాని జరగకపోవటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు





నృత్య రూపకాలతో ఆకట్టుకున్న కళారాధన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు..

నిజాంపేట్: దుండిగల్ మున్సిపల్ మల్లపేట్‌లోని ఎస్.ఎం.నర్సింగ్‌రావు గార్డెన్స్‌లో కళారాధన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయ డ్యాన్స్ విభాగం హెడ్ డాక్టర్ వనజా ఉదయ్, అఖిల భారత సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ టీచర్ లక్ష్మీ, అన్నపూర్ణ క్యాప్షన్స్ సర్వీసెస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ కొడాలి, వన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మహేష్‌రెడ్డి మర్రి, డాక్టర్ రంజిత, డాక్టర్ రంజిత్ నాదెండ్ల, టీఎస్ఎంఎస్‌డీసీ మాజీ ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, విశ్రాంత తెలుగు పండిట్‌లు డాక్టర్ పర్యాద సరళ, సులోచన, విశ్రాంత ఆర్టీసీ అధికారి మదన గోపాలస్వామి, కూచిపూడి డ్యాన్స్ మాస్టార్ పట్లూరి జయంతి తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎల్‌ఆర్‌ఐటీ' ఏరోనాటికల్ విద్యార్థుల ప్రతిభ



అవార్డులు సాధించిన ఎంఆర్‌ఎల్‌ఐటీ విద్యార్థులు

దుండిగల్: చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన ఎస్ఏఈ ఇండియా పోటీల్లో దుండిగల్‌కు చెందిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలకు చెందిన ఏరోనాటికల్ విభాగం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంఎల్ఆర్ఐటీ ఏరోనాటికల్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కో.ఆర్డినేటర్లు సాయికుమార్, శ్రీకాంత్‌ల నేతృత్వంలో పోటీల్లో పాలొన్న విద్యార్థులు బృందం మూడు బహుమతులను కైవసం చేసుకుంది. టీమ్ ఏలస్ కెప్టెన్ హర్షిత యాదవ్ ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ మైక్రోక్లాస్ అవార్డులో మొదటి బహుమతితో పాటు పదివేల రూపాయల నగదు బహుమతి అందుకున్నారు. అదేవిధంగా టీమ్ ఐరావత్ కెప్టెన్ ఇషాన్‌సూరి ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో ద్వితీయ బహుమతి, బెస్ట్ ప్రజెంటేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో తృతీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావులు ఎస్ఏఈ ఇండియాలో కళాశాలకు చెందిన ఏరోనాటికల్ విభాగం విద్యార్థులు మూడు అవార్డులను గెలుచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ బహుమతులు సాధించడానికి ఎంతో శ్రమించిన ఏరోనాటికల్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు నిజాంపేటలో వైఎస్సార్ వర్ధంతి

నిజాంపేట్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహించనున్నట్లు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ వైఎస్సార్ అభిమానుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రగతినగర్ ఏనుగుల బొమ్మ చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహానేతకు నివాళులర్పించాలని నిర్వాహకులు కోరారు.

కుత్బుల్లాపూర్‌లో...

కుత్బుల్లాపూర్: మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం షాపూర్‌నగర్ వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీశైలంగౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి


హైదర్‌నగర్ అంబీర్ చెరువు ఔట్‌లెట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున భారీ వర్షాల కారణంగా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు ఔట్‌లెట్ స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అంబీర్ చెరువు పూర్తిగా నిండు కుండల నిండుకుందని, ఔట్ లెట్ వద్ద పరిస్థితి, చెరువు కట్ట సామర్థ్యాన్ని పరిశీలించటం జరిగిందని, ఔట్ లెట్ ద్వారా వెలువడుతున్న నీటి ప్రవాహం ద్వారా చెరువు దిగువుల గల కాలనీలు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా ఇరిగేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, తూమును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. సహాయర చర్యలు ముమ్మరంగా చేపట్టాలని, లోతట్టు కాలనీలు, ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలన్నారు. ముంపుకు గురైన కాలనీల్లో మోటర్ల ద్వారా నీటిని తొలగించి యధాస్థితికి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి రామకృష్ణ హైస్కూలులో చదువుకున్న పూర్వ విద్యార్థులు, చిన్నానాటి మిత్రులు కలిసి నవ్యశ్రీ ఫౌండేషన్ అనాథ శరణాలయంలో నిత్యావసర సరుకులైన బియ్యం, మంచి నూనె, కందిపప్పు ఏకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, సురేందర్, వినోద్, మనోహర్, దుష్యంత్, చిన్ననాటి స్నేహితురాళ్లు పాల్గొన్నారు.